క్లుప్తంగా

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురం మళయాళస్వామి లక్ష్మీనారాయణ ఆశ్రమంలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు నిత్యశుద్ధానంద తృతీయ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు.. ఆశ్రమ అభివృద్ధి కమిటీ సభ్యుడు వెంకట్‌చరణ్ తెలియజేశారు. ఆరాధనత్సోవాల్లో భాగంగా తెల్లవారుజామున 4 గంటలకు సుప్రభాతసేవ, 6.30 గంటలకు ప్రణవ పతాకావిష్కరణ, 7గంటలకు రుద్రాభిషేకం, 9గంటల నుంచి గీతాయజ్ఞం 18 అధ్యాయాల పారాయణం, సాయంత్రం 4గంటలకు వేదాంత సభ, రాత్రి 7గంటలకు దీపాలంకరణ సేవ, పల్లకీసేవలు చేస్తామన్నారు. రెండోరోజు గురువారం ఉదయం 7గంటలకు రుద్రాభిషేకం, 9గంటలకు విష్ణు సహస్రనామయజ్ఞం, కుంకుమార్చన, ఆశీర్వాద పూర్వక ప్రవచనాలు, మధ్యాహ్నం నిత్యశుద్ధానంద సమాధి పూజలు చేస్తామన్నారు. మధ్యాహ్నం 1 గంటలకు మహానివేదన, మంగళహారతి, శాంతిమంత్రాలు, తీర్థప్రసాద వితరణ అన్నదానంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. నిత్యశుద్ధానంద అభిమానులు, శిష్యులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని సూచించారు.

రాణిపేట్‌లో టీబీ క్యాంపు



మిడ్జిల్: మండల పరిధిలో రాణిపేట్‌లో మంగళవారం టీబీ క్యాంపు నిర్వహించారు. క్యాంపునకు వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎవరికైనా టీబీ లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి శివకాంత్ సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది సంపత్, దేవయ్య, జంగయ్య, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

లఘుచిత్రానికి పురస్కారం

జడ్చర్ల టౌన్: పట్టణానికి చెందిన సీతారామాఫిలింస్ నిర్మాత భానూరు నాగరాజు తీసిన లఘుచిత్రం స్వాగతమమ్మ కళామతల్లికి స్వర్ణనంది పురస్కారం లభించింది. తెలుగు సంస్కృతి సాహితీ సేవాట్రస్టు–తెలంగాణ సంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డ్స్ అందించే ఈ పురస్కారాన్ని ఈనెల 16న హన్మకొండలో జరిగే వేడుకల్లో అందుకోనున్నట్లు నాగరాజు తెలియజేశారు.

దుస్తుల అందజేత

గండీడ్: మండల పరిధిలోని పలు పాఠశాలలకు మంగళవారం ఏపీఎం బాలకృష్ణ, ఐకేపీ సిబ్బంది ఎంపీడీఓ దేవన్న, ఎంఈఓ వెంకటయ్య దుస్తులను అందజేశారు. బుధవారం నుంచి వాటిని ఆయా పాఠశాలలో విద్యార్థులకు అంజేయనున్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

మహమ్మదాబాద్: మండల పరిధిలోని ఆయా పాఠశాలలకు మంగళవారం పుస్తకాలు పంపిణీ చేశారు. బుధవారం నుంచి వీటిని విద్యార్థులకు అందజేయనున్నారు. కార్యక్రమంలో సీఆర్పీ సుధాకర్, వెంకట్ పాల్గొన్నారు.

నల్లా కనెక్షన్లపై సర్వే

బాలానగర్: మండల పరిధిలోని 37 గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లపై సర్వే నిర్వహిస్తున్నారు. కనెక్షన్‌పై ఆరా తీస్తున్నారు. వాయిల్కుంట తండాలో మంగళవారం కార్యదర్శి బాసు నాయక్ సర్వే నిర్వహించారు.

సస్పెన్షన్లు ఎత్తివేయాలి

భూత్పూర్: మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలానికి చెందిన ముగ్గురు ఏఈవోలను ఈ నెల 7న అకారణంగా సస్పెండ్ చేశారని.. వారి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని మంగళవారం దేవరకద్ర ఏడీఏ యశ్వంత్‌రావుకు వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలోని ఏవో కార్యాలయానికి వచ్చిన ఏడీఏ యశ్వంత్‌రావును కలిశారు. అక్రమాలకు ఏఈవోలను బాధ్యులుగా చేసి సస్పెండ్ చేయడం సరికాదని పేర్కొన్నారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. స్థానిక ఏఈవో హర్షవర్దన్, హన్మంతు, శంకర్, ప్రదీప్‌లతో పాటు వివిధ మండలాలకు చెందిన ఏఈవోలు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐగా పదోన్నతి

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో గతంలో కానిస్టేబుల్‌గా పని చేసిన మహమ్మద్ ముస్తాక్ ఆ తరువాత ఎస్‌బీలో హెచ్‌సీగా దేవరకద్ర పరిధిలో పనిచేస్తూ ప్రస్తుతం ఏఎస్‌ఐగా పదోన్నతి పొందారు. దీంతో మంగళవారం ఆయను పలువురు అభినందించారు.

నేడు 'ఉల్లి' వేలం

దేవరకద్ర: దేవరకద్ర మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి పాయల వేలం నిర్వహించనున్నారు. కొన్ని వారాలుగా ఉల్లి వేలానికి సెలవుల కారణంగా అడ్డంకులు వచ్చాయి. అలాగే రైతులు నేరుగా అమ్ముకోవడం వల్ల కూడా వేలం జరగడం లేదు. రైతులు మార్కెట్‌కు ఉల్లిని అమ్మకానికి తేస్తే వేలం జరిగే అవకాశం ఉంది.

లావాదేవీలు నిల్..

మంగళవారం మార్కెట్‌లో లావాదేవీలు కొనసాగలేదు. సీజన్ లేక పోవడం వల్ల రైతులు ధాన్యం తీసుకురాక పోవడంతో ఎలాంటి వ్యాపారం జరగలేదు. ప్రస్తుతం యాసంగి సీజన్ ధాన్యం అంతా ఇప్పటికే రైతులు అమ్ముకున్నారు.

'నక్కలబండ' ఇదేం తంటా



జడ్చర్ల-మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు



సీసీ రోడ్లు లేని నక్కలబండ తండా

- కనీస సౌకర్యాలు కరువు
- జాతీయరహదారిపై పారుతున్న మురుగు
- పట్టించుకోని అధికారులు

జడ్చర్ల: మున్సిపాలిటీ పరిధిలోని నక్కలబండ తండ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. తండాలో దాదాపు వంద కుటుంబాలు నివసిస్తున్నా అక్కడ కనీసంగా సదుపాయాలు కరువయ్యాయి. డ్రెయినేజీ, సీసీరోడ్లు, తదితర సౌకర్యాలు కల్పించడంలో యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. జడ్చర్లకు కూతవేటు దూరంలో జడ్చర్ల–మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిని అనుసరించి ఉన్న ఈ తండాలో నేటికి కనీస సౌకర్యాలు కల్పించక పోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చిన తరువాత అయినా తండా అభివృద్ధి చెందుతుందని ఆశించినా.. నిరాశే ఎదురవుతోందని స్థానికులు వాపోతున్నారు. ప్రధానంగా తండాలో డ్రెయినేజీ, సీసీరోడ్ల సమస్య ఉందని చెబుతున్నారు. వెంటనే నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో దాదాపు రూ.45 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా నిదులు మంజూరు కాలేదు. దీంతో తండాలోని మురుగునీరు 167 నంబర్ జాతీయరహదారిపైకి పారుతోంది. దీంతో రహదారిపై రాకపోకలు కొనసాగించే వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. జాతీయరహదారి విస్తరణ పనుల సమయంలో తండాకు సంబంధించి డ్రెయినేజీ నిర్మించాలని కోరినా అధికారులు పెద్దగా పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు. మురుగు వెళ్లేందుకు సరైన వసతి లేకపోవడంతో ఇళ్ల మధ్య రోడ్లపై నిలుస్తోందని.. దీంతో ఈగలు, దోమలు విజృంభించి వ్యాధుల బారినపడుతున్నామని వాపోతున్నారు. వర్షాకాలం రావడంతో అంటువ్యాధుల బారినపడే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు తమ తండావైపు కన్నెత్తి చూడడం లేదని, జిల్లా అధికారులు సైతం నిత్యం తమ తండా పక్కగుండా వెళుతున్నా ఒక్కసారి గూడా సందర్శించిన పరిస్థితి లేదన్నారు. అక్కడక్కడ కొన్ని ఇళ్ల దగ్గర ఇంకుడు గుంతలు నిర్మించినా తండాలో కొంత భాగం రాతినేలగా ఉండడంతో మరిన్ని చోట్ల వాటిని నిర్మించుకోలేని పరిస్థితి ఉందన్నారు. గిరిజన తండాకు మున్సిపాలిటీ నుంచి ప్రత్యేక నిధులు కేటాయించాల్సి ఉన్నా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని.. ఇకనైనా అధికారులు స్పందించి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



తండాలో సీసీ రోడ్లు, డ్రెయినేజీ లేక పోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులకు ఎన్నోసార్లు సమస్యలను విన్నవించినా ఫలితం లేకపోయింది. డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో నీరు ఇళ్ల మధ్య నిలిచి దోమల బెడద పెరుగుతోంది. దీంతో రోగాల బారిన పడుతున్నాం. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలి.

– మహేశ్, నక్కలబండ తండా

ప్రతిపాదనలు పంపాం..



తండాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు రెండేళ్ల క్రితమే ప్రతిపాదనలు పంపాం. మూడు డ్రైనేజీలు, రెండు సీసీరోడ్లకు సంబంధించి రూ.45 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేసి బడ్జెట్ సమావేశంలో పెట్టినా ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు. జాతీయ రహదారి నిర్మాణ పనుల సమయంలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది.

– చైతు చౌహాన్, వార్డు కౌన్సిలర్, మున్సిపాలిటీ, జడ్చర్ల

మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ



జాతీయ రహదారి పక్కన కుంటను తలపించేలా నిలిచిన నీరు

అడ్డాకుల: మూసాపేట మండలం తుంకినీపూర్ స్టేజీ వద్ద జాతీయ రహదారి పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడింది. నాలుగైదు రోజులుగా ఇక్కడ మిషన్ భగీరథ నీళ్లు వృథాగా పోతున్నాయి. మూసాపేట నుంచి వచ్చే పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి నీళ్లు రహదారి పక్కన నిలుస్తున్నాయి. కుంటను తలపించేలా నీళ్లు నిలవడంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. నీటి నిల్వతో రహదారి దెబ్బతింటోంది. అదేవిధంగా నీళ్ల లీకేజీతో తాగునీరు కలుషితమవుతోంది. తుంకినీపూర్ రోడ్డు పైనే నీళ్లు నిలవడంతో ఇక్కడ గుంతల మూలంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజును సంప్రదించగా ఈ రోజే పైప్‌లైన్ లీకేజీ గురించి తమకు తెలిసిందన్నారు. బుధవారం మూసాపేట గ్రామ పంచాయతీ సిబ్బందిని పంపించి లీకేజీని సరి చేయిస్తామని పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి : కేసు నమోదు

నవాబుపేట: మండల కేంద్రంలో పెట్రోల్ పంపు సమీపంలో ఇద్దరు వ్యక్తులు కలిసి ఒక వ్యక్తిపై దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి కథనం ప్రకారం.. మంగళవారం జడ్చర్ల మండలం బండమీదిపల్లికి చెందిన కారుకొండ శివ నవాబుపేట మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో పని ముగించుని ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కారూర్‌కి చెందిన కావలి శ్రీను, కావలి నవీన్ శివ బైక్‌ను అడ్డగించి దాడి చేశారు. దీంతో శివకు తీవ్రగాయాలయ్యాయి. కాగా జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శివ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

కుక్కల బెడద తప్పించండి

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలో కుక్కల బెడద అధికంగా ఉందని సమస్య పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈమేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణానికి చెందిన యం.బి. బాలకృష్ణ, అనిల్‌కుమార్ వినతి పత్రం సమర్పించారు. కుక్కల వల్ల చిన్నపిల్లలను బయటకు పంపించాలంటే భయంగా ఉంటోందని.. ఇటీవలే పందుల బెడద మళ్లీ ప్రారంభం అయిందని సమస్యలు పరిష్కరించాలని కోరారు.

అసౌకర్యం కలగకుండా చర్యలు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా అన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పెద్దచెరువు పరిసర ప్రాంతాల్లో పర్యటించారు. అంతకుముందు అక్కడి నుంచి విడుదలయ్యే నీటిని బయటకు పంపింగ్ చేసే కాల్వ పనులను పరిశీలించారు. పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గతంలో విశాలంగా ఉన్న పెద్దచెరువు చుట్టూ కొందరు ఆక్రమించుకుని భవనాలు నిర్మించుకున్నారని పేర్కొన్నారు. నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ శాఖ ఈఈ విజయభాస్కర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ పాల్గొన్నారు.

కుట్టు కేంద్రాల పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: యూనిఫాం కుట్టే పని వెంటనే పూర్తి కావాలని మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. విద్యార్థుల కోసం మహిళా సంఘాల ఆధ్వర్యంలో వీరన్నపేట, పద్మావతికాలనీలలో కొత్త యూనిఫాం కుట్టే కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. గడువులోగా ఎంఈఓకు యూనిఫాం బ్యాగులు అందజేయాలని మెప్మా సిబ్బందికి సూచించారు.

అసంపూర్తిగా అభివృద్ధి పనులు

సాక్షినెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా బుధవారం బడులు ప్రారంభం కానున్నాయి. అయినప్పటికీ చాలా చోట్ల అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. చాలాచోట్లు ఎన్ని రోజులకు పూర్తవుతాయోకూడా తెలియని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో మంగళవారం సాక్షి ఆయా పాఠశాలలను సందర్శించి పరిస్థితిపై ఆరాతీసింది. కాగా పలు సమస్యలను, సా..గుతున్న పనులను క్లిక్‌మనిపించింది. ఆ దృశ్యాలు ఇలా..



జయనగర్ తండాలో సాగుతున్న పనులు



జడ్చర్ల పరిధిలో ప్రాథమిక పాఠశాలలో గదుల నిర్మాణం కోసం తవ్విన పిల్లర్ల గుంతలు



జడ్చర్ల రోడ్డు విస్తరణలో కూల్చి వేస్తున్న హాస్టల్



పెద్దర్పల్లిలో పెచ్చులకు మరమ్మతు



కొల్లూర్‌లో ప్రమాద కరంగా సంపు



బల్సుర్‌గొండలో ప్రమాదకరంగా గుంత



మిడ్జిల్ కేజీబీవీలో ప్రమాదకరంగా గుంత



కుచ్చర్‌కల్ ప్రాథమికోన్నత పాఠశాలలో పనులు



గూడూర్ ప్రాథమిక పాఠశాలలో..



సల్కర్‌పేట్ పాఠశాల వద్ద కూలిన ప్రహరీ

ఘనంగా గ్రామ దేవతల ఉత్సవాలు



ముచ్చింతలలో బోనాల ఊరేగింపు

చిన్నచింతకుంట: ముచ్చింతలలో గ్రామ దేవతలు, బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మూడురోజుల పాటు కొనసాగిన ఉత్సవాలల్లో సోమవారం గ్రామానికి నాలుగు దిక్కుల బొడ్రాయిలను ప్రతిష్ఠించారు. మంగళవారం బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవార్లకు నైవేద్యం సమర్పించారు. అనంతరం గ్రామ దేవతలు పోచమ్మ, మైసమ్మ, లక్ష్మమ్మ అమ్మవార్ల ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠినచర్యలు



రాజాపూర్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

రాజాపూర్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే ఎంతటి వారైనా కఠినచర్యలు తప్పవని జడ్చర్ల ఏడీఏ ఆంజనేయులు హెచ్చరించారు. మంగళవారం మండలకేంద్రంలోని సీడ్స్ అండ్ పెస్టీసైడ్ విత్తన దుకాణాల్లోనూ, తిరుమలాపూర్, కల్లేపల్లి గ్రామాల్లోని షాపుల్లో మండల వ్యవసాయశాఖ అధికారితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తే వారి కచ్చితంగా రసీదు ఇవ్వాలని డీలర్లకు సూచించారు. విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడంతో పాటు నిర్ణయించిన ధరలకే విక్రయించాలని సూచించారు.

ముగిసిన శిక్షణ శిబిరం



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో కరాటే మాస్టర్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఫౌండర్ కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో స్థానిక మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ పట్టణ ఉప కార్యదర్శి నర్సింలు మాట్లాడుతూ కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని అన్నారు. కరాటే మాస్టర్ వెంకటేశ్ మాట్లాడుతూ దాదాపు 45 రోజులపాటు విద్యార్థులకు వేసవి కరాటే శిక్షణ శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు బాసిద్, బుచ్చన్న, మహేందర్, హరి, శివశంకర్, పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపు



బెల్టులు సాధించిన విద్యార్థులతో జిల్లా జైలు సూపరింటెండెంట్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని జిల్లా జైలు సూపరింటెండెంట్ ఎ.వెంకటేశం అన్నారు. జిల్లా కేంద్రంలోని అల్‌నూర్ స్కూల్ ఆవరణలో మంగళవారం కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సూపరింటెండెంట్ మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం కరాటే మార్షల్ ఆర్ట్స్‌ను ప్రాక్టీస్ చేయాలన్నారు. గత ఏడాది డిసెంబర్‌లో ముంబయిలో జరిగిన అంతర్జాతీయ కరాటే మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించిన అల్‌నూర్ స్కూల్ విద్యార్థులు మారియబేగం, సాబేర్‌పాషను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాజియసుల్తానా, కరస్పాండెంట్ మహ్మద్ అబ్దుల్ అహద్ సిద్దిఖీ, డైరెక్టర్ ఖాజాపాష తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

నవాబుపేట: మండల కేంద్రంలో ఇరువర్గాలు భూమి విషయంలో గొడవ పడి గాయాలపాలై ఆస్పత్రిలో చేరిన ఘటన చోటుచేసుకుంది. కాగా చాలా రోజుల క్రితమే భూమి విక్రయించామని దానికి సంబంధించి హద్దులు చూస్తున్నట్లు మరికొందరు వివరించారు. దాడి ఘటనలో మెండే అంజయ్య తలకు గాయం కాగా జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అలాగే ఇంకొందరు సైతం తమపై దాడి జరిగిందని గాయాలు ఉన్నాయంటూ ఆసత్రిలో చేరారు. విషయంలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం



కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో (2003–04 బ్యాచ్ పదోతరగతి) మంగళవారం ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. . ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా అప్పటి ఉపాధ్యాయులు రాంమోహన్, సాయికుమార్, కృష్ణయ్య, బలరాం, లలితబాయి, వాణిశ్రీ హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

రాజీపడని నిత్య శ్రామికుడు

స్టేషన్ మహబూబ్‌నగర్: తాను తలపెట్టిన పనిని ఎంత కష్టాన్నైనా భరించి సాధించే వరకు రాజీపడని నిత్యశ్రామికుడు రామోజీరావు అని సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షులు జగపతిరావు అన్నారు. జిల్లా కేంద్రం పారిశ్రామికవాడలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో మంగళవారం ప్రముఖ వ్యాపారవేత్త, రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు సంస్మరసభ నిర్వహించారు. ఈసందర్భంగా జగపతిరావు మాట్లాడుతూ రామోజీ ఫిలింసిటీని నిర్మించి సినీ నిర్మాణరంగంలో అనూహ్య మార్పులకు నాంది పలికారని కొనియాడారు. గౌరవాధ్యక్షులు అక్కినేని నారాయణరావు, ప్రధాన కార్యదర్శి నస్కంటి నాగభూషణం, రాజసింహుడు, పి.శివుడు, జీబీ.పాల్ పాల్గొన్నారు.

బస్సుల ఫిట్‌నెస్‌కు వెసులుబాటు ఇవ్వాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రైవేటుపాఠశాలలు నడుపుతున్న బస్సుల ఫిట్‌నెస్‌కు 15 రోజు గడువు ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి ట్రస్మా నాయకులు వినతిపత్రం అందజేశారు. పాఠశాలలు ఇప్పుడే తెరిచారని అన్నారు. ఈ కారణంగా సిబ్బంది లేరని కొంత సమయం ఇస్తే ఫిట్‌నెస్ చేయిస్తామని వెసులుబాటు ఇప్పించాలని ఎమ్మెల్యేను కోరారు. దీంతో ఎమ్మెల్యే యెన్నం స్పందించారు. బస్సుల ఫిట్‌నెస్ విషయంలో కొంత సమయం ఇవ్వాలని ఈమేరకు సంబంధిత ఆర్టీఓకు సూచించారు. కార్యక్రమంలో ట్రస్మా అధ్యక్షుడు ప్రభాకర్, రాంచందర్‌జీ, అత్తర్‌బేగం, భానుప్రతాప్, హరినాథ్‌గౌడ్, సురేందర్ పాల్గొన్నారు.